# రోడ్ల అభివృద్ధికి 620 కోట్లు

- రాష్ట్రానికి విడుదల చేసిన కేంద్రం
- తొలి విడతలో ఇప్పటికే 400 కోట్లు
- సీఆర్ఎఫ్ కింద సహాయం: తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మరో రూ.620 కోట్లు విడుదల చేసింది. సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) కింద ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి రాజిందర్ కుమార్ తెలంగాణ ప్రభుత్వానికి లేఖను పంపించారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికిగాను వీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా సీఆర్ఎఫ్ కింద కేంద్రం ఇప్పటికే మొదటి విడతగా రూ.400 కోట్లు విడుదల చేసింది. దీంతో ఈ పథకం కింద రాష్ట్రానికి అందనున్న మొత్తం రూ.1020 కోట్లు కానున్నాయి. రెండో విడత సీఆర్ఎఫ్ నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్ర మంత్రి నితీశ్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ చొరవతో తాము ఈ అనుమతులు సాధించినట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఇంకా సుమారు రూ.3 వేల కోట్ల మేరకు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి కూడా త్వరలోనే అనుమతులు సాధిస్తామన్నారు.

**సీఆర్ఎఫ్ కింద రెండో విడతగా విడుదలైన నిధుల వివరాలు (పాత జిల్లాల ప్రకారం)**

| జిల్లా పేరు | పనులు | కి.మీ | నిధులు (రూ.లలో) |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 4 | 44.10 | 47 |
| కరీంనగర్ | 8 | 83.91 | 83 |
| ఖమ్మం | 5 | 74.70 | 76 |
| మహబూబ్‌నగర్ | 7 | 92.05 | 90 |
| మెదక్ | 6 | 64.10 | 74 |
| నల్లగొండ | 6 | 71.20 | 70 |
| నిజామాబాద్ | 4 | 55.94 | 55 |
| రంగారెడ్డి | 4 | 45.10 | 47 |
| వరంగల్ | 6 | 73.70 | 78 |
| **మొత్తం** | **50** | **604.80** | **620** |

# రోడ్ల నిర్మాణాల్లో జాప్యం చేస్తే చర్యలు

- కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చండి
- 45 రోజుల్లోనే సాంకేతిక ప్రక్రియ పూర్తవ్వాలి
- మార్చి 31లోగా పనులు పూర్తి: జూపల్లి



హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. పీఎంజీఎస్‌వై, నాబార్డు నిధులతో చేపట్టిన రహదారులు, వంతెనల నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల విభజన అనంతరం తొలిసారిగా ఈఎన్‌సీ కార్యాలయంలో సోమవారం జిల్లాల ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రహదారుల అంచనాలు, సాంకేతిక అనుమతుల వంటి ప్రక్రియ అంతా 45 రోజుల్లోనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో జాప్యం జరిగితే అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. టెండర్లు దక్కించుకుని నెలల తరబడి పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. పీఎంజీఎస్‌వై, నాబార్డు కింద ఇప్పటి వరకు మంజూరైన రహదారు లు, వంతెనల నిర్మాణాల పనులన్నీ మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో తేడా వస్తే సహించేది లేదన్నారు. అటవీ శాఖ అభ్యంతరాలతో కొన్ని పనులకు ఆటంకం కలుగుతోందని పలువురు ఇంజనీర్లు మంత్రి దృష్టికి తేగా... దీనిపై ఆ శాఖా మంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నరలోనే సుమారు 5 వేల కోట్ల వ్యయంతో దాదాపు 12 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణ పనులు మంజూరు చేశామని తెలిపారు. ఇందులో సగం పనులు పూర్తికాగా మిగతావి పురోగతిలో ఉన్నాయని చెప్పారు. కాగా, అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్‌డీవో), జిల్లా పంచాయతీ అధికారుల(డీపీవో)తో మంత్రి జూపల్లి ఈ నెల 19న సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 18, 19వ తేదీల్లో జరగాల్సిన రెండు సమావేశాలను ఒకే రోజు 19న నిర్వహిస్తూ షెడ్యూల్‌లో మార్పు చేశారు.

ఆంధ్రజ్యోతి Tue, 18 October 2016
epaper.andhrajyothy.com/c/13988849